విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 03, మార్చి 2025

అతిసారాకి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలి

- మృతి చెందిన కుటుంబాలకు 50 లక్షలు చెల్లించాలి
- ప్రత్యేక అధికారిచే విచారణ జరిపించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు

విశాలాంధ్ర ఆత్మకూర్ రూరల్ : ఆత్మకూరు పట్టణంలో గత రెండు రోజుల క్రితం అతి సారా బారిన పడి ఇద్దరు, ఈ రోజు ఒకరు మరణించారని చాలా బాధాకరమని ఈ మరణాలకు కారణం ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్, ఏఈ,నిర్లక్ష్యం చేసిన డిఎంహెచ్వో బాధ్యత వహించాలని, ఈ సంఘటన వల్ల పట్టణవాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బయందోళనలో జీవిస్తున్నారని తక్షణమే జిల్లా కలెక్టర్ పట్టణ పరిసరాలలో పర్యటించి సంబంధిత అధికారులపై, తప్పుడు నివేదికలు అందిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు కోరారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో అతి సారపై విచారణ జరిపించాలని కోరుతూ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగు రోజుల క్రితం ఆత్మకూరు పట్టణంలో అతిసారా ప్రభావం ఉందని తెలిసిన డిఎంహెచ్ఓ నిర్లక్ష్యం చేశాడని అనేక తప్పుడు నివేదికలు సమర్పిస్తూపై అధికారులకు తప్పుడు నివేదికలు డిఎంహెచ్ఓ అందించారని వారు అన్నారు. గతంలోనే అనేక సంఘటనలను తప్పుదోవ పట్టించిన చరిత్రని వారు విమర్శించారు. పట్టణ శానిటేషన్, త్రాగునిరు పరీక్షించి ప్రజలను కాపాడాల్సిన మున్సిపల్ కమిషనర్ పూర్తిగా విఫలం చెందారని కార్యాలయాలకే పరిమితమై సిబ్బందిని పెంచడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. ఈ సంఘటనకు మున్సిపల్ కమిషనర్ బాధ్యత వహించాలన్నారు. ఆత్మకూరు పట్టణంలో 200 మంది మున్సిపల్ సిబ్బంది ఉండాల్సిన చోట 100 మంది కూడా లేరని వారు అన్నారు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు ఆత్మకూరు పట్టణానికి వచ్చిన చనిపోయిన కుటుంబాలను పరామర్శించడంలో వైఫల్యం చెందారన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి విచారణకు ఆదేశించిన పరిస్థితుల్లో ప్రత్యేక అధికారిని నియమించాలని వారు కోరారు. మరణించిన మూడు కుటుంబాలకు ఒక్కకుటుంబానికి 50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ త్రాగునీటి డిఎంహెచ్వో లను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. జనాభా కనుగుణంగా మున్సిపల్ సిబ్బందిని పెంచాలని వారు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే ఈ విషయంపై మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తామని తక్షణ చర్యలకు డిమాండ్ చేస్తామని వారన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఇద్దరు కూడా సంఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించాలని వారు కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహి స్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు తాలూకా కార్యదర్శి టీ.ప్రతాపు, వెంకట శివుడు పట్టణ కార్యదర్శి అహ్మద్ హుస్సేన్ ఏఐటియుసి పట్టణ నాయకులు చాంద్ భాషా, లాల్, షేక్షావలి ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన గేదెల చోరీలు..!

ఆందోళన చెందుతున్న పాడి రైతులు

పెట్నికోటలో వరుస ఘటనలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పాడి పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతన్నలు గేదెలు మాయమవుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. గుర్తుతెలియని దుండగులు మేపుకెళ్ళిన గేదెలను ఎత్తుకెళ్లిపోతున్నడంతో యజమానులు కలవరం చెందుతున్నారు. మండలంలోని పెట్నికోట గ్రామంలో మూడు వారాల నుండి పాడి గేదెలు చోరీకి గురి అవుతున్నాయి. గ్రామానికి చెందిన చంద్రమోహన్ రెడ్డి 6 గేదెలు, ఈశ్వరమ్మ గారి నారాయణరెడ్డి కి చెందిన ఐదు గేదెలు, బోయ మల్లయ్య కు చెందిన 8 గేదెలు ఇటీవల చోరీకి గురైనట్లు యజమానులు తెలిపారు. చోరీకి గురైన గేదెల విలువ దాదాపు పదిలక్షలపైనె ఉంటుందని తెలిపారు. వేసవికాలం ప్రారంభం కావడంతో పాటు గ్రామ పరిధిలో సాగుచేసిన పంటలు కాలం పూర్తి కావడంతో గ్రామంలోని యజమానులు గేదెలను ఉదయం వదిలి వేస్తారు. తిరిగి ఆ గేదెలు అదేరోజు సాయంత్రం లోపు ఇంటికి చేరుకుంటాయి. గేదెలు ఇంటికి రాకపోవడంతో యజమానులు రెండు మూడు రోజులు పాటు చుట్టుపక్కల గ్రామాలలో వెతికిన వాటి జాడ కనిపించలేదు. గేదెలను కాపు కాసేవారు లేకపోవడంతో దొంగలకు అవకాశం గా మారింది. గ్రామం చుట్టూ కొండలు ఎక్కువగా ఉండడంతో పాటు పొలాల విస్తీర్ణం కూడా ఎక్కువగా ఉంది. ప్రజల సంచారం లేని పొలాల వైపు వెళ్లిన గేదెలేనె దొంగలు చోరీ చేశారు. చీకటి పడిన తర్వాతనే వీటిని వాహనాలలో దొంగలు తరలించి ఉంటారని ప్రజలు భావిస్తున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా గేదెలు మాయం అవుతుండడంతో యజమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు గేదెలను చోరీ చేస్తున్న దొంగలను పట్టుకుని న్యాయం చేయాలని యజమానులు కోరుతున్నారు.

గుంతల మయంగా.. బస్టాండ్ రోడ్డు

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు బస్టాండుకు వెళ్లే అద్వాన స్థితిలో గుంతల మయంగా ఉంది. ఆర్టీసీ బస్సులు ఒక రోడ్డులో బస్టాండ్ లోపలికి వెళ్లడం, మరో రోడ్డులో బయటికి బస్సులు వెళ్లడం జరుగుతుంది. ఆర్టీసీ బస్సులు వెళ్లే ఒక రోడ్డులో మరమ్మత్తులు చేయడంతో ఆ రోడ్డును బ్లాక్ చేశారు. ఇప్పుడు ఆర్టీసీ బస్సులు రావడం, పోవడం ఒకే రోడ్డులో జరుగుతుంది. ఈ రోడ్డు గుంతలు ఏర్పడి పూర్తి అద్వాన్న స్థితిలో ఉంది. వెలుగోడు పట్టణము మేజర్ గ్రామపంచాయతీగా దినదినాభివృద్ధి చెందుతుంది. అయినా ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి ని ప్రజాప్రతినిధులు గాని, స్థానిక ఎమ్మెల్యే గాని పట్టించుకోవడం లేదు. ఇక్కడ బస్టాండు ఏర్పాటై సుమారు 40 సంవత్సరాలు అవుతున్న ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అలాగే ఉంది. ఈ బస్టాండ్ నందు ఆత్మకూరు, నంద్యాల వైపు వెళ్లే బస్సులు, ఎమ్మెల్యే స్వగ్రామమైన వేల్పనూరు మీదుగా నందికొట్కూరుకు వెళ్లే బస్సులు సుమారుగా ప్రతిరోజు 30 నుంచి 50 వరకు బస్సులు తిరుగుతూ ఉంటాయి. ఈ బస్టాండ్ ద్వారా ఆర్టీసీ శాఖ ఆదాయం పొందుతుంది గాని, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. బస్టాండులో కనీస వసతులైన తాగునీరు లేదు. మరుగుదొడ్లు పూర్తి అద్వాన స్థితిలో ఉండి పనికిరాకుండా ఉన్నాయి. ప్రయాణికులు కూర్చోవడానికి కనీస వసతులు కూడా లేవు. ఆర్టీసీ అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని, ఇప్పటికైనా బస్టాండ్ రూపురేఖలు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

అక్రమ అరెస్ట్ ను ఖండించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఎల్ జి పాలిమార్ప్ కేసుకు సంబంధించి భాదితుల తరుపున పోరాడినందుకు అప్పటి ప్రభుత్వం అక్రమ కేసు పెట్టి నేడు నాన్ బెయిలబుల్ వారెంట్ వుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవి సత్యనారాయణమూర్తి (నాని)ని పోలీసులు అరెస్ట్ చేయడాన్ని వామపక్ష, ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శిఎన్. రంగనాయుడు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా గత వైసిపి ప్రభుత్వం టిడిపి, సీపీఐ, జనసేన, సిపిఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలని ప్రభుత్వం వచ్చిన వెంటనే రద్దు చేయాలని అధికార పార్టీనాయకులు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చినప్పుడు సానుకూలంగా స్పందించి రద్దుకు హామీ ఇచ్చారని అనేక కేసుల్లో ఉన్న నాయకులు ప్రజా ధనాన్ని సహజ వనరులను దోపిడీ చేస్తున్న నాయకులు బయట ప్రాంతంలో తిరుగుతున్నారని వారిని ఏమాత్రం పట్టించుకోకుండా అధికార పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను రద్దు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వము ఇచ్చిన మాట మరిచి ప్రజల కోసం పోరాడుతున్న ప్రజా నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం అమానుషమని వెంటనే సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవివి సత్యనారాయణమూర్తి (నాని)ని బేషరతుగా విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పుట్టగొడుగుల్లా.. ప్రైవేట్ హాస్పిటల్స్

ఇష్టారాజ్యంగా అనుమతులిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి

ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పుట్టగొడుగుల్లా ప్రైవేట్ హాస్పిటల్స్ పుట్టుకొస్తున్నాయని, ఇష్టారాజ్యంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి అనుమతులిస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు ఆరోపించారు. పేద ప్రజలను మోసం చేస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలపై ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదివారం నంద్యాల పట్టణ సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నంద్యాల జిల్లా కార్య దర్శి నాగరాముడు మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా రోజుకో హాస్పిటల్ పుట్టుకొస్తున్నాయని, ఆ హాస్పిటల్ యాజమాన్యాలు పేద ప్రజలు మోసం చేసేందుకే హాస్పిటల్ల ను నిర్వహిస్తూ ధనార్జనే ధ్యేయంగా హాస్పిటల్ నిర్వహణ చేస్తున్నారని వారు తెలిపారు. మరికొన్ని హాస్పిటల్లో వైద్యం పూర్తిగా రాని డాక్టర్లు కూడా డాక్టర్లమంటూ చలామణి అవుతూ ఒక రోగానికి చేయాల్సిన వైద్యాన్ని మరొక రోగానికి చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా వైద్యం సరిగ్గా రాని డాక్టర్లు కూడా రోజుకో హాస్పిటల్ ను ఏర్పాటు చేస్తూ పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ ప్రజల రక్త మాంసాలతో డాక్టర్లు పూట గడుపుతున్నారని, ఇప్పటికయి నావైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యక్ష కార్యక్రమాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నంద్యాల పట్టణ కార్యదర్శి విష్ణు, ఏఐవైఎఫ్ నాయకులు రవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

'ఆ నలుగురు' సేవ స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - బనగానపల్లె : ఆనలుగురు స్వచ్ఛంద సేవ సంస్థ పేరిట చేస్తున్న సేవలు పలువురికి స్ఫూర్తిదాయకం కావాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం బిసి గుర్రెడ్డి కాలనీలోని బిసి రాజారెడ్డి కార్యాలయం నందు బేతంచర్ల పట్టణానికి చెందిన ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు వన్నూరుభాషా, సభ్యులకు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అలాగే ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థకు చేదుడుగా ఉండాలనే సదుద్దేశంతో రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ వన్నూరుభాషా 2017లో ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి ఇప్పటివరకు దాదాపు 100కు పైగా అనాథ మృతదేహాలకు సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించడం ఎంతో గొప్ప కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో, రామ మద్దిలేటి రెడ్డి ,గడ్డం నాగేశ్వర్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి, అల్తాఫ్ ,షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ విద్యావేత్త రాయసం రత్నస్వామి మృతి

విశాలాంధ్ర - వెలుగోడు : ప్రముఖ విద్యావేత్త, వెలుగోడు గ్రామ నివాసి డాక్టర్ రాయసం రత్నం స్వామి ఆదివారం స్వగృహంలో వయోభారంతో కన్నుమూశారు. వెలుగోడులో అనేక విద్యాసంస్థలకు సారథ్యం వహించారు. నీలం సంజీవరెడ్డి డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ఏర్పాటు విషయంలో ప్రముఖ పాత్ర వహించారు. సర్దార్ పటేల్ ఐటిఐ ను స్థాపించారు. ముస్లిం, మైనార్టీల కోరిక మేరకు ఉర్దూ కళాశాలను స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో స్థాపించారు. సుదీర్ఘకాలంగా కళాశాలలకు ప్రిన్సిపల్గా, కరెస్పాండెంట్గా పనిచేశారు. ఈయన అందించిన విద్యా వ్యాప్తి వల్ల ఎందరో ఉపాధ్యాయులుగా,డాక్టర్లు అధికారులుగా, ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. సామాజిక సేవలో భాగంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీని ఏర్పాటు చేసి , తన సేవలను జిల్లా వ్యాప్తంగా అందించారు అలాగే వృద్ధాప్య ఆశ్రమాన్ని స్థాపించి వృద్ధులకు వసతిని కల్పించారు. ఈయన వివాహం చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండి ఈ సేవలను అందించారు. ఈయన మృతికి గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంతాపము తెలియజేసి శ్రద్ధాంజలి ఘటించారు.

జిల్లా జనరల్ సెక్రటరీగా ఎక్సైజ్ ఎస్సై సందీప్ యాదవ్ ఎన్నిక

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణ పరిధిలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఎక్సైజ్ ఎస్ఐగా పనిచేస్తున్న సందీప్ యాదవ్ ను ఆదివారం నాడు జరిగిన (ఏపీపీఈఓఏ) ఆంధ్రప్రదేశ్ ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి, కోవెలకుంట్ల ఎక్సైజ్ ఎస్సై జి.సందీప్ యాదవ్ను , ఉమ్మడి కర్నూలు జిల్లాల జనరల్ సెక్రటరీగ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ మేరకు అధికారులు సందీప్ యాదవ్ కు అభినందనలు తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ తోటి ఉద్యోగులకు న్యాయం జరిగేలా పనిచేస్తానని ఎక్సైజ్ ఎస్సై సందీప్ యాదవ్ తెలిపారు. అలాగే ఈ ఎన్నికలు ఏకగ్రీవం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఎస్సై సందీప్ యాదవ్ చెప్పారు.

చెంచుల అభివృద్ధికి నిధుల కొరత లేదు

పెచ్చేరువులో చెంచులతో ఎంపీ శబరి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నల్లమల అరణ్యంలోని చెంచుల అభివృద్ధికి నిధుల కొరత లేదని, ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం చెంచుల సంక్షేమం కోసం ప్రత్యేక కొత్త పథకం ఏర్పాటు చేసి వారి అభివృద్ధి, సంక్షేమం కోసం అవసరమైన నిధులు వెంటనే మంజూరు చేస్తుందని ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నల్లమల అరణ్యం చెంచుల రాజధాని పెచ్చేరువు చెంచు గూడెంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెంచు మహిళలు, గూడెం పెద్దలతో వారి సమస్యలు తెలుసుకునేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్రూర మృగాలు, విషసర్పాల మధ్య కనీస వసతులకు దూరంగా బ్రతుకుతున్నామని, అటవీ అధికారుల వేధింపులు తొలగించాలని, ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణం పనులు చేయకుండా అటవీ అధికారులు అడ్డుపడుతున్నారని, తదితర సమస్యలను వినతి పత్రం ద్వారా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి చెంచు మహిళలు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ 20 రోజుల క్రితమే నంద్యాల పార్లమెంట్ పరిధిలోని చెంచులకు 600 లకు పైగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంద్వారా పక్కా గృహాలు మంజూరు చేయడం జరిగిందని, సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాల చెంచు గూడెంలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 4.40 కోట్లతో తారు రోడ్డు మంజూరు చేయడం జరిగిందని, రూ.1.50 కోట్ల నిధులతో ఈ గూడెంలలో విద్యుత్ సరఫరాకు నిధులు మంజూరు చేయించి కరెంటు పనులు పూర్తి చేశామన్నారు. చెంచు చిన్నారులను బడులకుపంపించేందుకు, వారిలో అవగాహన కల్పించేందుకు తాను చెంచు గూడేలలో పర్యటన చేశానని, గిరిజన పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. జిల్లా లోని 46 చెంచు గూడెంలు అభయారణ్యం (కోర్ ఏరియా) నిషేధిత పరిధిలో ఉన్నాయని, పులుల సంరక్షణతో పాటు చెంచుల అభివృద్ధి కూడా ముఖ్యమని, అటవీ చట్టాలకు లోబడి వారి అనుమతితో చెంచుల బాగుకోసం కూడా కృషి చేస్తామన్నారు. కొందరు అటవీ అధికారులు చెంచులను ఇబ్బంది పెడుతున్నారని తనకు ఫిర్యాదు రావడంతో జిల్లా కలెక్టర్ రాజకుమారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. శ్రీశైలంలోని ఐటీడీఏను ప్రక్షాళన చేసి, అక్కడ గిరిజనేతర ఉద్యోగులను తొలగించి గిరిజన ఉద్యోగులను మాత్రమే ఐటీడీఏలో విధులు నిర్వహించేలా చూడాలని ఎంపీ శబరిని చెంచు గూడేల పెద్దలు కోరగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకొని పోతానని ఎంపీ శబరి హామీ ఇచ్చారు.

తాగునీటిలో కలుషితం లేదు

నీటి నమూనాల పరీక్ష అనంతరమే తాగునీటి సరఫరా

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఆత్మకూరు పట్టణంలోని తాగునీటి సరఫరాలో ఎలాంటి కలుషితం లేదని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని నీలితొట్టివీధి, గొల్లపేట వీధుల్లో కలెక్టర్ తనిఖీ చేసి అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా విలేకరులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో కొళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగునీటిలో ఎలాంటి కలుషితం లేనట్లు ల్యాబ్ రిపోర్టులు వెల్లడించాయన్నారు. తాగునీటి పైప్ లైన్ల ద్వారా సరఫరా అయ్యే నీటి నమూనాలను ల్యాబ్ లకు పంపించి అన్ని పారామీటర్లలో పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ల్యాబ్ టెస్టుల్లో నీరు కలుషితమైనట్లు నిరూపణ కాలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నీరు కలుషితం లేదని ప్రజలు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి రోగులను పరామర్శిస్తూ వైద్య సిబ్బంది 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మరణించిన వ్యక్తులు ఇతర అనారోగ్య కారణాలవల్ల మృతి చెందారే తప్ప కలుషిత నీటి వల్ల కాదని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి నాగజ్యోతి, డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

పెద్దబోదనంలో చోరి..

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలం లోని పెద్దబోదనం గ్రామం ఎస్సి కాలనీలో చోరి జరిగిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఓబులేసు దంపతులు గత నెల 28 న కడప జిల్లా జమ్మలమడుగు లోని తమ కూతురు వద్దకు వెళ్ళి తిరిగి ఇంటికి చేరుకోగా ఇంటికి గల తలుపులు తెరచి ఉంచడం గమనించి లోనికి వెళ్ళి చూడగా బీరువాను పగలగొట్టి అందులో ఉన్న సుమారు మూడున్నర తులాల బంగారు ఆభరణాలు చోరికి గురయ్యాయని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోని విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం నుండి క్లూస్ టీమ్ చోరి జరిగిన ప్రాంతానికి చేరుకొని చోరి జరిగిన ఇంటిలోని తలుపుల,బీరువాలపై గల వేలిముద్రల నమూనాలను సేకరించారు.

రెడీమేడ్ షాపుల అద్దెలు తగ్గించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : రెడీమేడ్ షాపుల అద్దెలు తగ్గించి వ్యాపారస్థులను ఆదుకొని స్థానిక వ్యాపారస్థులను బ్రతికించండని రెడీమేడ్ షాపుల యజమానుల అసోసియేషన్ అధ్యక్షులు గద్వాల నరసింహరాజు, ఉపాధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి శేఖరప్ప, కోశాధికారి జోరావర్ సింగ్, కమిటీ సభ్యులు వినయ్, సత్యం రెడ్డి, ఆదినారాయణ, రియాజ్ స్థానిక రెడీమేడ్ వ్యాపారస్థులు పేర్కొన్నారు. నంద్యాల పట్టణం వివేకానంద సెంటర్ లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ షాపింగ్ మాల్స్, ఆన్ లైన్ వ్యాపారాల వల్ల మా వ్యాపారాలు బాగా దెబ్బ తింటున్నాయని, షాపుల బాడుగలు కూడా రావడం లేదని, దయచేసి ప్రజలు స్థానిక వ్యాపారస్థులను ప్రోత్సహించాలని వారు కోరారు. కరోనా సమయంలో కూడా కరొనాకు లెక్క చేయకుండా పండుగలకు, పెళ్లిళ్లకు షాపులు తెరిచి బట్టలు ఇవ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు. దాదాపు 40, 50 రెడీమేడ్ షాపులు వ్యాపారాలు జరగక మూత పడే పరిస్థితి వచ్చిందని, కావున స్థానిక ప్రజలు, వినియోగదారులు రెడీమేడ్ షాపులను ఆదరించాలని వారు కోరారు. తక్కువ ధరకు నాణ్యత గల బట్టలను తెచ్చి విక్రయిస్తున్నామని వివరించారు. భవన యజమానులు షాపుల బాడుగలను మంచి మనసుతో తగ్గించాలని వారు కోరారు. నంద్యాల వినియోగదారులు తమను ఆదరించాలని పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు పూల అంగళ్ళు దగ్ధం

విశాలాంధ్ర-చాగలమర్రి : పట్టణంలోని పాతబస్టాండులో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని నాలుగు పూల అంగళ్ళు దగ్ధమయ్యాయి. గత కొన్ని ఏళ్ళుగా పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పూల అంగళ్ళు దగ్ధమై వ్యాపారులకు నష్టం వాటిల్లింది. సమాచారం తెలుసుకున్న ఆళ్ళగడ్డ అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తా,లేక గుర్తు తెలియనివ్యక్తులు నిప్పంటించారా అనే విషయంపై పలుఆరోపణలు వినిపిస్తున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

మాంసాన్ని ప్లాస్టిక్ కవర్లో విక్రయించరాదు

విశాలాంధ్ర - బనగానపల్లె : ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాడు మటన్ వ్యాపారస్తులు మటన్ కొనుగోలుదారులకు ప్లాస్టిక్ కవర్లు మటన్ విక్రయిస్తుండగా అమ్మకం దారులకు,కొనుగోలుదారులకు ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. పట్టణంలో సంక్రాంతి 15నుంచి ప్లాస్టిక్ నిషేధం ఉందని గుర్తు చేశారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అదేవిధంగా వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ ఫెడరేషన్ ఏఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 4న నియోజవర్గ స్థాయిలో ధర్నా కార్యక్రమానికి పిలుపు ఇవ్వడం జరుగుతుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురామమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారం రాగానే ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తామని చెప్పినప్పటికీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9మాసాలు గడిచినప్పటికీ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం చాలా విచారకరమన్నారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర, 10,000 మంజూరు చేయాలని మోటార్ వాహనదారులపై మెడ మీద కత్తి పెట్టిన విధంగా జరిమానాలు, శిక్షలు విధించే జీవో 21,జీవో 31 రద్దు చేయాలన్నారు. ఆటో డ్రైవర్ మోటర్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ, సామాజిక పెన్షన్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. తదితర సమస్యల పైన మార్చి 4వ తేదీన జరిగే ఆందోళన కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఆటో కార్మికులు కదలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

చెట్టు విరిగి పడిన ఘటనలో బాలిక మృతి

పలువురి దిగ్భ్రాంతి

విశాలాంధ్ర – సి బెళగల్ : సిబెళగల్ మండల పరిధిలోని పోలకల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చెట్టు విరిగి బాలికలపై పడటంతో ఇద్దరికి స్వల్ప గాయాలు,ఒకరికి తీవ్ర రక్త గాయాలు అయిన సంఘటన పాఠకులకు విధితమే. అయితే ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎనిమిద తరగతి విద్యార్థిని శ్రీ లేఖ చికిత్స పొందుతూ కోలుకోలేక కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందింది.వివరాలు ఇలా ఉన్నాయి.ఈ బాలిక స్వగ్రామం గోనెగండ్ల మండలం పెద్ద నేలటూరు గ్రామం కాగా తల్లిదండ్రులు శిరీషా, దస్తగిరి తరచూ వలస వెళ్తున్న కారణంగా తల్లి పుట్టినిల్లు అయిన బెళగల్ మండలం పోలకల్ గ్రామంలోని మేనమామ ఇంట్లో నుండే పోలకల్ హైస్కూల్ లో చదిస్తున్నారు. అయితే శుక్రవారం సైన్స్ డే సందర్భంగా పాఠశాల ఆవరణంలో ఉన్న చెట్ల కింద అక్కడి ఉపాధ్యాయులు ఎనిమిదవ తరగతి విద్యార్థులకు సైన్స్ డే సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఆ స్కూల్ ఆవరణంలోని కాలం చెల్లిన చింత చెట్టు భారీ కొమ్మ ఈదురు గాలుల దాటికి విరిగి బాలికలపై పడింది.ఇందులో ఉమా, ఇందూ అనే విద్యార్థినీలకు స్వల్ప గాయాలు కాగా శ్రీ లేఖ కు తీవ్రంగా రక్తగాయాలు కావడంతో ఇంచార్జి హెచ్ ఎం అయ్యస్వామి హుటాహుటినా అంబులెన్సు ద్వారా కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో బాలిక శ్రీ లేఖ కోలుకోలేక మృతి చెంది తల్లితండ్రులకు విషాదం మిగిల్చింది. శ్రీ లేఖకు ఒక చెల్లి ఒక తమ్ముడు ఉన్నారు. పెద్ద కూతురు శ్రీలేఖ విద్యలో ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కాంక్షించిన తల్లిదండ్రులకు భగవంతుడు నిరాశ మిగిల్చాడు. కుటుంబీకులు, బంధువులు, తోటి విద్యార్థులు శ్రీలేఖ మరణ వార్త విని శోకసంద్రంలోకి వెళ్లారు. బెళగల్ ఎస్సై తిమ్మారెడ్డి, విద్యాధికారి ఆదామ్ బాషా, హెచ్ ఎం రమాదేవి, జిల్లా ఉన్నత విద్యాధికారులు, మరియు మండల ప్రత్యేక అధికారి శ్యామల,గ్రామ పెద్దలు, గ్రామస్తులు, తదితర నాయకులు, ఉపాధ్యాయులు పలువురు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

కార్మికుల కష్టాలు.. కార్పొరేట్లకు లాభాలు

విశాలాంధ్ర – కర్నూలు : కార్మికులను కష్టాల పాలు చేసి కార్పొరేట్ రంగాలకు లాభాలు పెంచేదుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప విమర్శించారు. ఆదివారం జిల్లా ఏఐటియుసి జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా అధ్యక్షుల కే.అజయ్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రాల అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వలన కార్మికులకు కష్టాలు కార్పొరేట్లకు లాభాలు వస్తున్నాయని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక హక్కులు కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికులను బానిసలుగా చేస్తున్నాడని వారు విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణలో భాగంగా విదేశీ పెట్టుబడులను ఎల్ఐసి లాంటి పెద్ద ప్రభుత్వ సంస్థలు 100శాతం అనుమతించి దేశ సంపదని కార్పొరేటర్లకు అప్పచెబుతున్నాడని వారు విమర్శించారు. రాష్ట్రంలో తెలుగు దేశం, జనసేన,బిజెపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, భావన నిర్మాణ సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరిస్తామని, ఆటో కార్మికులకు వాహన మిత్ర కింద పదివేల నుండి 15వేల రూపాయలు పెంచుతామని అంగన్వాడి వర్కర్స్ జీతాలు పెంచుతామని కాంటాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందిందని తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్మికులో పోరాటాలకు సిద్ధం కావాలని వారిని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే ఈ నెల3 వ తేదీన కర్నూల్ కలెక్టర్ కార్యాలయం ముందు మున్సిపల్ సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నాలను ఆరవ తేదీ జరుగు చలో విజయవాడ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు.అంగన్‌వాడి కార్మికుల సమస్యల కొరకు ఈనెల 10వ తేదీ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని ,ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల నాలుగో తేదీ కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నా కార్యక్రమాల్ని, ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 6వ తేదీన కర్నూల్ డిఎంహెచ్ఓ ఆఫీస్ ముందు జరుగు కార్యక్రమాలను విజయవంతం చేయ్యాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎన్. కృష్ణయ్య, జిల్లా ట్రెజరర్ జి చంద్రశేఖర్ జిల్లా సహాయ కార్యదర్శి ఓబి నాగరాజు ,ఆలూరు తాలూకా అధ్యక్షులు కృష్ణమూర్తి ,బి రాముడు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏఈశ్వర్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాభి, రాధ ,స్కూలు ఆయాల జిల్లా నాయకురాలు లక్ష్మీదేవి ,కర్నూల్ నగర అధ్యక్షులు బి. వెంకటేష్,ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు పత్తికొండ ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటి, రంగన్న ఆదోని పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు. భీమరాజు, బి. ఎంకన్న ఎమ్మిగనూరు నియోజకవర్గ కార్యదర్శి, తిమ్మ గురుడు, కోడుమూరు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మధు, రాముడు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు, నల్లన్న, రేణుక,కృష్ణ వెల్దుర్తి మండల కార్యదర్శి మాధవస్వామి తదితరులు హాజరు కావడం జరిగింది.

బాబోయ్.. ఎండలు

విశాలాంధ్ర –హొళగుంద : మండలంలో వేసవి ఎండలు తీవ్రంగా దంచి కొట్టడంతో ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. మార్చి నెల ప్రారంభానికి ముందే ఎండలు తీవ్రంగా ఉండడంతో మరో రెండుట నెలల ఎండలు ఎలా ఉంటాయంటూ ప్రజలు ఆందోళన చెందారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉండడం వ్యవసాయ కూలీలు ఉదయమే పొలాలకు వెళ్లి మధ్యాహ్నానికి తిరిగి ఇంటికి చేరుకుంటున్నారు. ఎండ నుండి ఉపశమనం పొందడానికి జ్యూసులు, చల్లని పానీయాలు, కూల్ డ్రింక్స్, కలింగర పండ్లు, తాటి పండ్లు, కర్బూజా పండ్లను తిని సేద తీరుతున్నారు. ఎండలు దాటికి తట్టుకోలకాలువలుఎల్ ఎల్‌సి దిగువ కాలువలో యువకుడు జలకలాటలాడుతున్నారు. ఎండలో నీటిని ఎక్కువ త్రాగడానికి ప్రభుత్వ జూనియర్ కాలేజ్, సిద్దేశ్వర స్వామి బుక్ సెంటర్ వద్ద స్వచ్ఛంద సేవా సంస్థలు చెలిగేంద్రాన్ని ప్రారంభించారు. తాసిల్దార్ కార్యాలయం, బస్టాండ్, వాల్మీకి సర్కిల్లో చలివేంద్రాన్ని ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలను విద్యార్థులు ఎండలోనే ప్రయాణిస్తూ పరీక్షలకు హాజరవుతున్నారు. వేసవికాలం ఎంతవరకు విద్యుత్ సరఫరాను సక్రమంగా అమలు చేయాలని ప్రజలు ఆదివారం డిమాండ్ చేశారు. ప్రజలు గొడుగులు, టోపీ, తెల్ల వస్త్రాలు ధరించి వడదెబ్బ శోకకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు. మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ న్యూటన్ మాట్లాడుతూ ప్రజలు ఎక్కువ వేసవి ఎండలో తిరగ వద్దని విజ్ఞప్తి చేశారు. వడదెబ్బ సోకిన వారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాలని కోరారు. ఎండలు ఎక్కువ శాతం మంచినీటిని, మజ్జిగ, చల్లటి పానీయాలను తీసుకోవాలని నీడలోనే ఎక్కువ కాలం చేస్తే మంచిదని అన్నారు. వృద్ధులు, పిల్లలు, రోగి లు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు

పీఆర్సీకి కేటాయింపులు లేకపోవడం బాధాకరం

విశాలాంధ్ర– ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో పిఆర్సికి నిధులు కేటాయించక పోవడం బాధాకరమణి ఎస్టియు జిల్లా కార్యదర్శి బి.గోపాల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్టియు భవన్ లో ఆదోని, కౌతాలం మండలాల ముఖ్య నాయకుల సమావేశం ఆదోని మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి గోపాల్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్సికు సంబంధించినటువంటి బడ్జెట్లో నిధులు కేటాయింపులు లేకపోవడం ఉద్యోగ వర్గానికి తీవ్ర నిరాశకి గురిచేసిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటిన ఉద్యోగులకు కనీసం ఒక డిఏ కూడా ప్రకటించకపోవడం శోచనియమన్నారు. వెంటనే పిఆర్సికి కమిషన్ వేసి పెండింగ్లో ఉన్న డిఏలను చెల్లించాలని కోరారు. అనంతరం ఎస్టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.సి సుంకన్న,ఆదోని మండలం అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ హాజరై ప్రసంగిస్తు ఉపాధ్యాయ బదిలీలకు ప్రత్యేక చట్టం తేవటం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. బదిలీల చట్టంలో సర్వీస్ పాయింట్లను ఒక పాయింట్‌గా కేటాయించడం సబబు కాదన్నారు. దానిని 0.5 గా కేటాయించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా 2023లో జరిగిన బదిలీలో జీవో 117 ద్వారా 8 సంవత్సరాలు సర్వీస్ పూర్తి కాకుండా హేతుబద్ధీకరణ గురై బదిలీలు పొందినటువంటి ఉపాధ్యాయులకు ఇప్పుడు 117 జీవో రద్దయింది కాబట్టి బదిలీలు కోరుకునే వారికి పాత స్టేషన్ పాయింట్లు కేటాయించాలన్నారు.పెండింగ్లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఆర్సి 2022 డిఏ బకాయిలు వెంటనే చెల్లించాల న్నారు. సమావేశంలో కౌతాళం మండల ఉపాధ్యక్షుడు పి. అంజనయ్య, సీనియర్ నాయకులు భాస్కర్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్తీ బంగారంతో.. ఘరానా మోసం..!



విశాలాంధ్ర – దేవనకొండ : మండలంలో హాల్‌మార్క్ ధృవీకరణ లేకుండా నాణ్యత లేని బంగారాన్ని విక్రయిస్తూ పల్లె ప్రజలను మోసం చేసే దందా యథేచ్ఛగా సాగుతోంది అని ప్రత్యేకించి ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ కావడంతో గ్రామీణ ప్రజలు పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేస్తుండటంతో ఈఅక్రమ వ్యాపారం మరింత ఉధృతమైంది, వివాహాలకు బంగారం అవసరమయ్యే సమయాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ ఆభరణాలను అసలు ధరకు విక్రయిస్తూ స్వర్ణ వ్యాపారులు అమాయక గ్రామస్తులను దోచుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి, నాణ్యతను నిర్ధారించే హాల్‌మార్క్ లేకుండా బంగారు షాపులు తెరుచుకుని ఇష్టారాజ్యంగా వ్యాపారం చేయడం నిబంధనలకు విరుద్ధమైనా, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ దందా నిరాటంకంగా కొనసాగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అసలు ధర కంటే తక్కువ రేటుకి మంచి బంగారమని నమ్మబలికి పేద ప్రజలను మోసం చేసే దందా పెరిగిపోతున్నా, ఇప్పటి వరకు ఎటువంటి తనిఖీలు లేకపోవడం సంచలనంగా మారింది, పెళ్లిళ్ల వేళ తక్కువ బడ్జెట్‌లో బంగారం కొనాలనే ఆశతో గ్రామీణ ప్రజలు ఈ మోసాలకు బలవుతుండటంతో, సంబంధిత అధికారులు వెంటనే చొరవ చూపి హాల్‌మార్క్ లేని బంగారు షాపులపై దాడులు నిర్వహించాలని, గ్రామీణ ప్రజలకు నిజమైన బంగారం, నకిలీ బంగారం మధ్య తేడా గుర్తించేలా అవగాహన కల్పించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర–పత్తికొండ: కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.తిమ్మయ్య, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బి.సురేంద్ర కుమార్ లు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నలకదొడ్డి గ్రామంలో రైతులను కలుసుకొని రైతు సంఘం సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కు చట్టం తీసుకు వచ్చి, రైతు ఆత్మహత్యలను నివారించాలన్నారు. రైతులు పంట పెట్టుబడికి బ్యాంకుల్లో తీసుకున్న అన్ని రకాల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి 20 వేల రూపాయలు తక్షణమే ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలను మంజూరు చేసి,పంటల బీమా పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపట్టేందుకు పార్టీలకతీతంగా రైతులు కలిసి రావాలన్నారు.

5న సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర – కర్నూలు : సీపీఐ కర్నూలు జిల్లా కార్యవర్గ సమావేశం మార్చి 5న సి.ఆర్.భవన్ కర్నూలు నందు జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పాల్గొంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో జిల్లాకు జరిగిన అన్యాయం, జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయింపుపై ప్రభుత్వ నిర్లక్ష్యం, వలసలు నివారణలో ప్రభుత్వ వైఫల్యంపై ఈ సమావేశంలో చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు.సకాలంలో కార్యవర్గ సభ్యులు, ఆహ్వానితులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

అక్రమ అరెస్టును ఖండించండి

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : గత ప్రభుత్వ హయాంలో జరిగిన విశాఖ ఎల్‌జి పాలిమర్స్ కేసుకు సంబంధించి భాదితుల తరుపున పోరాడినందుకు అప్పటి ప్రభుత్వం అక్రమ కేసు పెట్టిందని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేస్తామని చెప్పారని, నేడు దానికి విరుద్ధంగా విశాఖ పోలీసులు అత్యుత్సాహంతో నాన్ బెయిలబుల్ వారెంట్ వుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తిని పోలీసులు అరెస్ట్ చేయడాన్ని అందరూ ఖండించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక పత్రికా ప్రకటనలో తెలియజేస్తూ, ప్రజాధనాన్ని, సహజ వనరులను దోపిడీ చేస్తున్న వారందరూ బయట తిరుగుతున్నారని, వారిని వదిలిపెట్టి ప్రజల కోసం పోరాడుతున్న నాయకులను అరెస్ట్ చేయడం సమంజసం కాదని,జె.వి సత్యనారాయణ మూర్తిని తక్షణమే విడుదల చేసి అక్రమ కేసును ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జి.శ్రీలేఖ కుటుంబానికి రూ.5 లక్షల

ఎక్స్ గ్రేషియాను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థిని జి. శ్రీలేఖ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ను ప్రకటించిందని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సి.బెళగల్ మండలం, పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8 వ తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీలేఖపై చెట్టు విరిగి పడడంతో గాయాల పాలు కాగా వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో చేర్పించి, విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడం జరిగిందని, అయితే దురదృష్ట వశాత్తూ విద్యార్థిని శ్రీలేఖ ఆదివారం ఉదయం మృతి చెందిందని కలెక్టర్ తెలిపారు..ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వం వెంటనే స్పందించి మృతి చెందిన విద్యార్థిని జి. శ్రీలేఖ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ను ప్రకటించిందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థిని జి.శ్రీలేఖ మృతి దురదృష్టకరం అని కలెక్టర్ తన విచారాన్ని వ్యక్తం చేశారు..ఈ సందర్భంగా కలెక్టర్ తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పాఠశాలల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా విద్యా శాఖాధికారిని అదేశించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో పథకాలు సాధించిన విద్యార్థినిలు

విశాలాంధ్ర – కర్నూలు : రాజమండ్రిలో ఇటీవల జరిగిన ఖేలో ఇండియా సీనియర్స్ రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో కె.వి.ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ఏడు పథకాలు సాధించారు. ఆదివారం నాడు కళాశాల ఆవరణలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్ కుమార్ గారు విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థినీలను అభినందిస్తూ, ఈరోజుల్లో మహిళలకు ఉషూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మ రక్షణ కొరకు ఎంతో ఉపయోగపడుతుందని ఖేలో ఇండియాలో పథకాలు సాధించారని అనంతరం పథకాలను సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల చరిత్ర అధ్యాపకురాలు ఎ.జయలక్ష్మి మేడం. పథకాలు సాధించిన వివరాలు బంగారు పథకం దేవి, శ్రావణి, జయలలిత. వెండి పథకం చిన్న గర్జమ్మ, రాధిక, నసీమ. రాగి పథకం నందిని సాధించారని జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి శ్రీనివాసులు తెలిపారు.

శ్రీలేఖ కుటుంబానికి రూ.15 లక్షలు

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర – కోడుమూరు : ప్రమాదంలో మృతి చెందిన శ్రీలేఖ కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి డిమాండ్ చేశారు.ఆదివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడుతూ సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీలేఖ శుక్రవారం రోజున సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో చెట్టూ విరిగిపడిన ఘటనలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం 10 గంటలకు చనిపోవడం చాలా దురదృష్టకరమన్నారు. కావున ప్రభుత్వం జిల్లా కలెక్టర్ గారు విద్యాశాఖ అధికారులు స్పందించి మృతి చెందిన శ్రీలేఖ కుటుంబానికి 15 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్యగా డిమాండ్ చేస్తున్నాము. గాయపడిన మిగతా విద్యార్థులకు 5 లక్షలు చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులందరిని సమీకరించి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఎండ వేడిమికి గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల : ఏడాది వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరించిన నేపథ్యంలో వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ వేడిమికి గురికాకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. కర్నూల్ నగరంలోని గాయత్రి ఎస్టేట్లో ఉన్న శ్రీ గురుదత్త క్లినిక్ లో జరిగిన కార్యక్రమంలో ఎండల వేడిమికి గురి కాకుండా వృద్ధులకు చెప్పులు, గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు నెలల పాటు కొనసాగే వేసవికాలంలో ఎండ వేడికి గురి కాకుండా వృద్ధులు, చిన్న పిల్లలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉదయం 11:00 లోపు సాయంత్రం ఐదు గంటల తర్వాత ప్రతి ఒక్కరూ తమ పనులను కొనసాగించాలని, మిగతా సమయంలో నీడ ప్రాంతాల్లో ఉండడం మంచిదని తెలిపారు. చెట్లు అందుబాటులో ఉండేవారు వాటి కింద ఉండటం వలన ఎండ వేడికి కాకుండా ఉండవచ్చు అని చెప్పారు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరు సాధ్యమైనంత ఎక్కువ నీరు తాగడం మంచిదని తెలిపారు. కలుషితమైన నీటిని కాకుండా స్వచ్ఛమైన నీటిని తాగేలా జాగ్రత్తలు పాటించాలన్నారు.వేసవి ఎండల్లో తిరిగే వారికి వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని, అలాగే శరీరంలో నీరు ఇంకిపోవడం వల్ల డీహైడ్రేషన్కు గురి అయ్యే అవకాశం ఉందని చెప్పారు. శరీరంలో నీరు ఇంకిపోవడం వల్ల మూత్రపిండాలకు రక్త సరఫరా తగ్గిపోయి మూత్రపిండాల వైఫల్యం సంభవించే అవకాశం ఉందన్నారు. కొన్ని సందర్భాలలో ఎండ వేడిమికి గురి కావడం వల్ల అపస్మారక స్థితికి చేరడం, రక్తపోటు పడిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. శరీరంలో ఎండాకాలంలో ఉప్పు శాతం తగ్గిపోవడం వల్ల సోడియం లెవెల్స్ తగ్గిపోతాయని దీనివల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు.ఎండాకాలంలో భూమిలో వేడి పెరగడం వలన అధిక ఉష్ణోగ్రతలు చోటుచేసుకునే అవకాశం ఉందని దీనివల్ల మానవాళికి అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు.వేసవి ఎండలు ముఖ్యంగా ఇల్లు లేని, రేకుల షెడ్ లో నివసించే పేదలపై అధిక ప్రభావం చూపించే అవకాశం ఉందన్నారు.వేసవికాలంలో ఆకాశంలో ఓజోన్ పొర దెబ్బ తినడం వలన అనేక దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయన్నారు. వేసవి ఎండల తీవ్రత హెచ్చరికల నేపథ్యంలో తన వంతు బాధ్యతగా ప్రజలకు అవసరమైన సూచనలు సలహాలు ఇస్తూనే పేద వృద్ధులకు చెప్పులు, గొడుగులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

వలస విద్యార్థుల ఆశ కిరణం.. సీజనల్ హాస్టల్స్

విశాలాంధ్ర– హొళగుంద : వలస విద్యార్థులకు సీజనల్ హాస్టల్స్ ఆశకిరణాలుగా నిలుస్తాయని మండల విద్యాధికారి జగన్నాథం అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన హొళగుందలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సౌజన్యంతో అంబేద్కర్ ఎస్, హెచ్ జి, వరలక్ష్మి ఎస్ హెచ్ జి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్య అధికారి జగన్నాథం మాట్లాడుతూ మారుమూల మండలంలో సీజనల్ హాస్టల్స్ వలస విద్యార్థులకు ఆశ కిరణాలుగా నిలుస్తున్నాయన్నారు ఇక్కడ 100 మంది విద్యార్థులకు వసతితో పాటు భోజన సౌకర్యం సమృద్ధిగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. హాజరు పట్టికలో ఉన్న విద్యార్థుల పేర్లను చదివి వలస విద్యార్థులు వీరే అని నిర్ధారించుకున్నారు. విద్యార్థులను ఒక్కొక్కరిని స్వయంగా పిలుచుకొని అల్పాహారంతో పాటు భోజన సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడగగా విద్యార్థులు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందిస్తున్నారని తెలిపారు మీ యొక్క తల్లిదండ్రులు ఏ ఏ ప్రాంతాలకు వలసలు వెళ్లారని అడగగా గుంటూరు, బెంగళూరు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు విద్యార్థులు తెలిపారు సీజనల్ హాస్టల్లో అన్ని సౌకర్యాలు చక్కగా ఉన్నాయి మీరు బాగా చదివి మీ తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ సాయి బేస్, సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయులు సోహెబ్, దుర్గయ్య, కేర్ టేకర్లు జమదగ్ని, లాల్ సాబ్ ,వీరప్ప, వంట మనుషులు లలిత ,ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

లింగేశ్వరుడి పట్టాభిషేకం విజయవంతం చేయండి

విశాలాంధ్ర –హొళగుంద : మండలంలోని నేరనికిలో నేరనికి లింగేశ్వర పట్టాభిషేకం ఉత్సవాన్ని విజయం చేయాలని సర్పంచ్ కురువ వనమ్మ, వైకాపా నాయకుడు ఎస్కే సోమప్ప కోరారు. సర్పంచ్ వన్న మ్మ ఆదివారం మాట్లాడుతూ నేరనికి లో8,9 తేదీలలో పట్టాభిషేక ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని అన్నారు. స్వామివారి పట్టాభిషేక ఉత్సవంలో దాదాపు 50 ఉచిత సామూహిక వివాహాలు జరుగుతాయని నూతన వధూవరులకు తాళిబొట్టు, దుస్తులు, అందించి వివాహానికి వచ్చిన బంధుమిత్రులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఉత్సవ సందర్భంగా సంబంధిత అధికారులు త్రాగునీరు, విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటామని అధిక సంఖ్యలో భక్తులు, బంధుమిత్రులు వస్తున్న సందర్భంగా అధికారులు త్రాగునీటి ఇబ్బంది లేకుండా శ్రద్ధ వహించాలని కోరారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

విశాలాంధ్ర –హొళగుంద : ముస్లిం సోదరులు అత్యంత పవిత్ర మాసంగా భావించే రంజాన్ నెల ఉపవాస దీక్షలు ఆదివారం నుండి ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం ఏడు గంటలకు నెలవంక కనిపించడంతో ఆయా మసీదులలో ముస్లిం సోదరులు తరవి నమాజును చేశారు. ఆదివారం ఉదయం నుండి ముస్లిం సోదరులు రంజాన్ నెలమొదటి ఉపవాస దీక్ష సందర్భంగా సహారి చేసి మసీదులలో ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్షులతో మసీదులు కిటకిటలాడాయి. తీవ్రంగా ఉన్న ఎండను లెక్కచేయకుండా ముస్లిం సోదరులు, మహిళలు, పిల్లలు సైతం రంజాన్ ఉపవాస దీక్షను పాటించారు. రంజాన్ ఉపవాస దీక్ష పాటించే వారి కోసం మసీదులు అన్ని సౌకర్యాలు కల్పించా మని మసీదు ముత వల్లిలు కొలిమి వహిద్, ముల్లావలి, శాలి ఫక్రుద్దీన్, ముల్లా షబ్బీర్, అల్లా బకాష్, డాక్టర్ కాశి మ్, సన ఉల్లలు తెలిపారు. రంజాన్ సందర్భంగా దూదేకుల మసీదు, మహమ్మదీయ మసీద్, శాలి మసీదులను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం రంజాన్ ఉపవాస దీక్షలు ఉపవాసాన్ని విరమించేఇఫ్తార్ విందును ప్రజలు నిర్వహించారు. రంజాన్ సందర్భంగా అత్తర్, ఖర్జూర పండ్లు, పండ్లు ఇతర వస్తువులను ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో కొనుగోలు చేశారు. మండలంలోని ఎల్లార్తి, ఇన్గలదహాళ్, వందవాగలి, గజ్జెహళ్లి, నేరనికి, సులువాయి, కొత్తపేట, హెబ్బటం, తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలను ప్రారంభించారు. సంబంధిత అధికారులు త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని పారిశుద్ధ్యంలోకించకుండా చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు డిఎస్ భాష, అబ్దుల్ సుభాన్, మోయిన్‌లువిజ్ఞప్తి చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

మృతి చెందిన బాలిక శ్రీలేఖ పాడె మోస్తున్న విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్ : సి.బెలగల్ మండల పరిధిలోని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలిక శ్రీలేఖ మృతి చెందింది. ఫిబ్రవరి 28వ తేదీన పోలకల్ పాఠశాల మైదానంలో వున్న చెట్టు ఈదురు గాలులకు మీద పడటంతో తీవ్రగాయాల పాలయ్యింది. హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించింది. ప్రమాదం జరిగిన రోజు నుండి మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా డిఇఓ తో పాటు మండల విద్య శాఖ అధికారి ఆదమ్ బాషా, హెడ్మాస్టర్ అసోసియేషన్, ఆ పోలకల్ హెడ్మాస్టర్ మరియు టీచర్స్ అవిరామంగా కృషి చేశారు. డీఈఓ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించడమే కాకుండా మండల విద్యాధికారులు అక్కడే వుంచి చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం శ్రీలేఖ తుదిశ్వాస వదలడంతో జిల్లా విద్యాధికారి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. బాధను దిగమింగి

పోస్టుమార్టం వద్ద తనే దగ్గర వుండి బాలిక తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. మేమున్నామంటూ భరోసాను కుటుంబ సభ్యులకు అందించారు. స్వగ్రామం గోనెగండ్ల మండల పరిధిలోని పెద్దనెలటూరుకు వెళ్లిన జిల్లా విద్యాధికారి ఎస్. శ్యామ్యూల్ పాల్ అంత్యక్రియల్లో పాల్గొని పాడెమోసి నివాళులు అర్పించారు. వెంటనే అంత్యక్రియలకు 20వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు.

అడవి బిడ్డల కోసం.. రెడ్ క్రాస్ వైద్య సేవలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : అడవి బిడ్డల కోసం రెడ్ క్రాస్ సొసైటీ వైద్య సేవలందిస్తోందని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు రాజకుమార్ గణియ, రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. మొబైల్ హెల్త్ వ్యాన్ ద్వారా శ్రీశైలం రెడ్ క్రాస్ బ్రాంచ్ చైర్మన్ నాగ శేషయ్య మెరుగైన వైద్య సేవలు అందించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ నాగ శేషయ్య ఆధ్వర్యంలో నల్లమల అడవులలో నివసిస్తున్న అడవి బిడ్డలైన చెంచు గిరిజనులకు ఉచిత వైద్య సేవలను అందించారు. నంద్యాల జిల్లా శ్రీశైలం మండలంలోని హటకేశ్వరం వద్ద గల చెంచుగూడెంలో నివసిస్తున్న చెంచు బిడ్డలకు రెడ్ క్రాస్ సొసైటీ వారి మొబైల్ హెల్త్

వ్యాన్‌ను అందు బాటులో పెట్టి వారి ఆరోగ్య సమస్యలపై చర్చించి వారికి అవసరమైన మందులు టానికులు ఇవ్వడం జరిగింది. ఇక్కడ నివసిస్తున్న చెంచు గిరిజనులు అందరికీ కూడా బిపి షుగర్ అలాగే పల్స్ ఆక్సీ మీటర్ ద్వారా ఆరోగ్యమును పరీక్షించి వారికి అవసరమైన సిరప్ లను, టాబ్లెట్లను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయడం జరిగిందని శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ నాగ శేషయ్య తెలిపారు. ఇక్కడ నివసిస్తున్న చెంచు గిరిజనులు నల్లమల అడవుల్లోకి వెళ్లి అటవీ ఉత్పత్తులను సేకరించి వాటి ద్వారా వచ్చిన ఆదాయంతో జీవనం సాగిస్తుంటారు కనుక ఎక్కువగా వీరి జీవనం అడవులలో సాగుచున్నందున చెంచులకు ఎక్కువగా చర్మ సంబంధిత వ్యాధులు దగ్గు ఆయాసం ఆస్తమా గుండె సంబంధిత వ్యాధులతో ఎక్కువగా అనారోగ్యం పాలవుతుంటారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ పంపిన మొబైల్ హెల్త్ వ్యాన్ ద్వారా అడవి బిడ్డలకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని బ్రాంచ్ చైర్మన్ నాగశేషయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం పీహెచ్ సి వైద్యులు బుజ్జిరెడ్డితో పాటు స్థానిక గ్రామీణ వైద్యులు డాక్టర్ కే ప్రసాద్, విజయలక్ష్మి పాటుగా సభ్యులు ఎస్ భాస్కర్, దమయంతి, ఫారెస్ట్ అధికారి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ టాగోర్, అంబులెన్స్ డ్రైవర్ వరుణ్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారని శ్రీశైలం బ్రాంచ్ చైర్మన్ నాగ శేషయ్య తెలిపారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర - కర్నూలు : మార్చి 8 వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూల్ జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా మెడికల్ క్యాంపు, ఓపెన్ హౌస్ ను సందర్శించిన మహిళలు, విద్యార్థినిలకు పోలీస్ అధికారులు పోలీస్ స్టేషన్ లో జరుగు విధులు, మహిళా సహాయ కేంద్రం పట్ల అవగాహన, పోలీసులు పనితీరు, వాడే పరికరాలు, పలు రికార్డుల నిర్వహణ తదితర విషయాలపై వివరించారు. మహిళ ల భద్రత ,హక్కులు సాధికారతపై అవగాహన కార్యమాలు చేపట్టారు.మహిళా చట్టాలు, ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ సామాజిక మాధ్యమాలు మరియు సైబర్ క్రైమ్స్ పై తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు తప్పనిసరిగా స్వీయ రక్షణ కలిగి ఉండాలని, ఎదుటివారి నుండి తమను తాము రక్షించుకోవడం నేర్చుకోవాలని తెలిపారు. స్వీయ రక్షణ నైపుణ్యాలు, దృఢంగా మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండాలని, అదేవిధంగా సైబర్ భద్రత నియమాలు గురించి ప్రస్తుతం మనం టెక్నాలజీ యుగంలో ఉన్నామని,స్మార్ట్ మొబైల్స్ ఎక్కువగా వాడవద్దని, మొబైల్ ఫోన్స్ ఎక్కువగా వాడటం వలన సైబర్ క్రైమ్ లాంటి నేరాలు, జరగడానికి అవకాశం ఉందని, అనాథరైజ్డ్ యాప్స్ మరియు మొబైల్స్ లో వచ్చే లింకులు సెలెక్ట్ చేయవద్దని తెలిపారు. జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి వచ్చిన బాలికలందరూ మంచిగా చదువుకొని సమాజానికి, దేశానికి, రాష్ట్రానికి ఉపయోగపడాలని తెలిపారు. పోలీస్ శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎల్లవేళలా పోలీస్ సిబ్బంది సహాయం, సహకారాలు ఉంటాయని పోలీస్ అధికారులు తెలియజేశారు. మహిళలు/చిన్నారులకు అత్యవసర సమయంలో సహాయం కొరకు హెల్ప్‌లైన్ నెంబర్లు చైల్డ్ హెల్ప్ లైన్:1098, ఉమెన్ హెల్ప్ లైన్:181,పోలీస్ హెల్ప్ లైన్:100 / 112, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్:1930 , పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 7777877722 కు నెంబర్లకు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు.

రైతులను వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ఆంధ్రప్రదేశ్ రైతులను మరోసారి కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైఎస్సార్సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు రవిచంద్రా రెడ్డి ఆరోపించారు. ఆదివారం పెద్దకడబూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ 2024 - 2025 సంవత్సరం రైతు భరోసా ఎగనామం పెట్టిందని విమర్శించారు. ధరల స్థిరీకరణకు కేవలం 300 కోట్ల రూపాయలు కేటాయించడం చాలా బాధాకరమన్నారు. రాయలసీమ ప్రాంత రైతులను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. మిరపకు గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో మిరప కొనుగోలు చేయడానికి మార్కెట్లను అభివృద్ధి చేయాలని, నష్టపోతున్న మిరప రైతులకు ఎటువంటి ఉపయోగం లేకుండా కూటమి ప్రభుత్వం వాగ్దానాలు కేవలం పేపర్లో ప్రకటనలకే పరిమితి అయ్యాయని ఆరోపించారు. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులకు బడ్జెట్ లో ఎటువంటి కేటాయింపులు లేకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రీలేఖ కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

విశాలాంధ్ర - కర్నూలు : సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామంలో జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల ఆవరణలో సైన్స్‌డే సందర్భంగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ సందర్భంగా ఏడుగురు విద్యార్థినిలపైన చెట్టు పడడంతో ఆదివారం శ్రీలేఖ విద్యార్థిని చనిపోయిందనీ సమాచారం రాగానే వెంటనే ప్రభుత్వ హాస్పిటల్‌లో మార్చరి దగ్గరికి వెళ్లి విద్యార్థిని మృతదేహాన్ని చూసి చాలా బాధాకరమని వాళ్ల కుటుంబానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా,రంగప్ప మాట్లాడుతూ శ్రీలేఖ కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలి అలాగే వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పాతబడిన భావనలు, బలహీనమైన చెట్లను తొలగించి కొత్తవి నిర్మించా లని జిల్లా విద్యాశాఖ అధికారిని చెప్పటం జరిగింది. ఇలాంటి సంఘట నలు ఎక్కడ పునరావృతం కాకుండా జిల్లా మండల విద్యాశాఖ అధికా రులు పర్యవేక్షణ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అబుబక్కర్ సాయి ఉదయ్ పి ఎస్ ఎన్ జిల్లా కన్వీనర్ అమర్ బాబు, నగర ఉపాధ్యక్షులు మల్లేష్ ఆర్యన్ సహాయ కార్యదర్శి ఆదిత్య పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థిని మృతి పట్ల ఆప్టా సంతాపం

విశాలాంధ్ర - కర్నూలు : సి.బెళగల్ మండలం పోలకల్ జడ్పీహెచ్ఎస్ నందు చెట్టు విరిగి ఆపాఠశాల విద్యార్థులు గాయపడడం, శ్రీలేఖ అనే విద్యార్థిని మరణించడం విచారకరం దురదృష్టకరం. ఈ సంఘటన పట్ల ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) కర్నూలు జిల్లా శాఖ పక్షాన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తపరుస్తూ, ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తున్నామన్నారు.ఈ సంఘటనలో గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని, మరణించిన శ్రీలేఖ అనే విద్యార్థిని ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తూ , శ్రీలేఖ తల్లిదండ్రులకు తోటి విద్యార్థులకు, మరియు పోలకల్ జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి మనోధైర్యాన్ని కలిగించాలని ఆభగవంతున్ని ప్రార్థిస్తున్నామని తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లను తగలబెట్టిన ముస్లిం మైనార్టీ నాయకుడు

విశాలాంధ్ర - బనగానపల్లె : ప్లాస్టిక్ కవర్లను తగిలిపెట్టిన ముస్లిం మైనార్టీ నియోజవర్గ అధ్యక్షుడు రాయలసీమ సలాం. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో టమాట, ఉల్లిగడ్డలు వ్యాపారస్తులు ఆటోల నందు ప్లాస్టిక్ కవర్లలో టమోటా ఉల్లిగడ్డ విక్రయిస్తుండగా ప్లాస్టిక్ కవర్లు తీసుకొని కాల్చివేయడం జరిగినది. ప్లాస్టిక్ కవర్ల బదులు బయో డీగ్రేడ్ కవర్లు ఉపయోగించాలని తెలియజేశారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

విశాలాంధ్ర - బనగానపల్లె: పరిమితికి మించి ప్రయాణిస్తున్న రెండు ఆటోలను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. నందివర్గం గ్రామంలో బండి ఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దాయాది మోహన్ మరియు ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చాకలి పరశురాముడు లు తమ ఆటోలలో పరిమితికి మించి అధికంగా ప్రయాణికులను ఎక్కించుకొని,అతి వేగంగా,నిర్లక్ష్యంగా తమ ఆటోలను నడుపుకొని వస్తుండగా వారి ఆటోలను అదుపులోకి తీసుకొని డ్రైవర్ల పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - నందికొట్కూరు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నందికొట్కూరు నియోజవర్గ వైఎస్ఆర్సిపి ముద్దుబిడ్డ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం నియోజవర్గ ప్రజలు వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వైసిపి నాయకులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఉన్నటువంటి రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ వింగ్ అధ్యక్షులు ఉండవెల్లి సోమశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, నరేష్ రెడ్డి, సతీష్ రెడ్డి, సూర్య రెడ్డి, మోహన్ రెడ్డి, సోషల్ మీడియా మధు, ఇమ్రాన్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ ఇన్స్పెక్టర్‌గా ఎంపికైన వెలుగోడువాసి

విశాలాంధ్ర - వెలుగోడు : పేద కుటుంబంలో జన్మించి ఉన్నత చదువులు చదివి సబ్ ఇన్స్పెక్టర్ గా మద్దెల సతీష్ ఎంపిక కావడం జరిగింది. తండ్రి మద్దెల సంజీవ కుమార్ మాధవరం గ్రామం, వెలుగోడు మండలానికి చెందినవారు. సామాన్య వ్యవసాయ పొలం పనులు చేస్తూ రైతుగా జీవిస్తున్నారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు సచివాలయం ఉద్యోగి, రెండో కుమారుడు ఇప్పుడు సబ్ ఇన్స్పెక్టర్ గా ఎంపికయ్యారు కుమార్తె ను కూడా ఉన్నత చదువు చదివిస్తున్నారు.తన కుమారుడు దిగ్విజయంగా అనంతపురం నందు పోలీసు శిక్షణ కళాశాల లో ప్రాదమిక శిక్షణ పూర్తి చేసుకొని, సత్య సాయి జిల్లా కి సబ్ ఇన్స్పెక్టర్గా నియమించబడడం సంతోషదాయకమని అన్నారు.కుటుంబ సభ్యులు ,గ్రామస్థులు మద్దెల సతీష్‌ను అభినందించారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి పునదిలా బడ్జెట్

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా ఉందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలను ఆదుకునే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయన్నారు. గత వైసీపీ పాలకుల విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్ధరించేసే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ల నేతృత్వంలో బడ్జెట్‌ను రూపొందించారన్నారు. అన్ని వర్గాలకు నిధులు కేటాయించారని, అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6300 కోట్లు కేటాయించడం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందన్నారు. 48వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను రూపొందించి రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం మాత్రమేనన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని కౌన్సెలింగ్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఇంఛార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేర నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఒకటవ పట్టణ సిఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశామని, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనరాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని,పోలీసుల మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

భక్తులతో కిక్కిరిసిన ఇమామ్ ఖాసిం ఉరుసు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో ఇమామ్ ఖాసిం ఉరుసు పండుగను భక్తులు, గ్రామప్రజల ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రెండు రోజుల నుండి ఇమామ్ కాసిం ఉరుసు మహోత్సవం జరుగుతాఉంది సాయంకాలం కిస్తీ కార్యక్రమంలో అనేకమంది భక్తులు, ప్రజలు తండోపతండాలుగా హాజరై దర్గను దర్శించుకుని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామంలో ఇమా

మ్ ఖాసిం ఉరుసు సందర్భంగా గ్రామంలో చిన్నలు, పెద్దలు అందరూ కొత్త బట్టలతో కలిసి కట్టుగా పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఈ పండుగకు కులమత బేధాలు లేకుండా కలిసి వచ్చి దర్గాకు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. క్రిష్ణగిరి పోలీస్ బందోబస్తు వారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్సై మల్లికార్జున తెలిపారు.

ఇండస్ ఆసుపత్రిలో కిడ్నీ విభాగం ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల శ్రీనివాసనగర్ సెంటర్ లో నిర్వహిస్తున్న ఇండస్ హార్ట్ ఆసుపత్రిలో యురాలజీ సర్జన్ డాక్టర్ రమేష్, గైనకాలజీ నిపుణురాలు డాక్టర్ రజని దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన మూత్రపిండ శస్త్ర చికిత్సల విభాగాన్ని ఆదివారం ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ ప్రారంభించారు. ఐఎంఏ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర పిపీడబ్ల్యూ విభాగం వైస్ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ హరినాథ్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర శాఖ మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీసౌజన్య, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్

కుమార్ కన్సల్టేషన్ రూమ్, ఓపిడి, ఆపరేషన్ థియేటర్, పోస్ట్ ఆపరేటివ్ రికవరీ వార్డు తదితర విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ డాక్టర్ రమేష్ గత ఏడు సంవత్సరాలుగా నంద్యాలలో శాంతిరాం ఆసుపత్రిలో మూత్రపిండ శస్త్ర చికిత్సల వైద్య సేవలందించిన అనుభవంతో ఇప్పుడు ఇండస్ ఆసుపత్రిలో యూరాలజీ శస్త్ర చికిత్సల విభాగం ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని నంద్యాల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.డాక్టర్ రమేష్ మాట్లాడుతూ మూత్ర పిండాలు, మూత్రాశయం, మూత్ర నాళాల శస్త్ర చికిత్సలు, పిల్లలు కలగని మగ వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ కార్తీకి,డాక్టర్ భార్గవర్ధన రెడ్డి, డాక్టర్ జహంగీర్, డాక్టర్ కృష్ణ చైతన్య, కోటి శ్రీనివాస్ డాక్టర్ లలిత, డాక్టర్ హరిత, అధిక సంఖ్యలో నంద్యాల ప్రాంత వైద్యులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాలలో కార్డన్ సెర్చ్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా ఇంఛార్జి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్. యుగంధర్ బాబు పర్యవేక్షణలో నేర నివారణ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి ఉంచి జిల్లాలోని అన్నీ సబ్ డివిజన్ లలో రాచర్ల, కొలిమిగుండ్ల, సంజామల, రుద్రవరం,పాణ్యం,బ్రాహ్మణకొట్కూర్ మొదలగు పోలీసు స్టేషన్ పరిదిలలో కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సంధర్భంగా నంద్యాల జిల్లాను నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యం తో జిల్లా పోలీసు అదికారుల ఆధ్వర్యంలో పైన తెల్పిన ప్రాంతాలలో జిల్లా ఎస్పీ ఆదేశాలతో వారి పోలీసు స్టేషన్ క్యుఆర్టి టీం సిబ్బంది స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి నేడు తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమాని

తులు, రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో సరైన ధృవపత్రాలు లేని సుమారు 34 మోటార్ సైకిలను, 01 ఆటో, 10 క్వాటర్ బాటిల్లను స్వాదినం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు కార్డెన్ సెర్చ్ చేసిన గ్రామాలలో గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత నేరాలపై అవగాహన కల్పిస్తూ, ఏవరైనా చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు అధికారులు హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లు నిరంతరం కొనసాగుతుంటాయని పేర్కొన్నారు.ఈ విధంగా కార్డెన్ సర్చ్ ఆపరేషన్ చేయడం వలన పట్టణాలలో గ్రామాలలో ఎలాంటి నేరాలు జరగకుండా ఉంటాయని నేరాలు చేసిన వారిని పోలీసులు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరని ప్రజలు తెలియజేస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

అమరవీరులకు ఘన నివాళులు

విశాలాంధ్ర - కోడుమూరు : పట్టణంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. ఆదివారం మహాజన నేత ఉద్యమాల పులిబిడ్డ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ బిడ్డలు బంగారు భవిష్యత్తు కోసం జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధనలో అసువులు బాసిన మాదిగ అమర వీరులకు ఎమ్మార్పీఎస్,ఎంఎస్పి,ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు పూలతో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య,ఎంఈ ఎఫ్ తాలూకా అధ్యక్షులు మహేష్ ముఖ్య అతిదులుగా హాజరై మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశారన్నారు.ఈ విధంగా అమరవీరులను స్మరించుకోవడం మన భాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు శ్రీనివాసులు, నరసింహులు,ఆనంద్,ఎంఎస్పి జిల్లా నాయకులు రాజు,మండల నాయకులు నగేష్,లక్ష్మన్న,దేవరాజు, బుడగజంగాల నాయకులు సిరిగిరి మద్దిలేటి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర -హొళగుంద : మండలంలోని గజ్జిహళ్లిలో ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ ఆధ్వర్యంలోఆదివారం సొడు చేను కాలనీలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన 20 లక్షల రూపాయల సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ ఆరుభట్ల నాగమ్మ భూమిపూజ చేశారు. కాలనీలో సీసీ రోడ్డు లేక ప్రజలు బు రదగుంటలోనే నడిచారని అన్నారు. సొడు చేను కాలనీలో ఉపాధి హామీ పథకం ద్వారా మూడు సిసి రోడ్లు నిర్మించడం జరుగుతుందని కూటమి ప్రభుత్వం వల్ల ప్రతి పల్లెలో రోడ్లు చేపట్టడం జరుగుతుంది అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గిరి మల్ల, రామ లింగ, బిజెపి యువమోర్చా నాయకుడు రామలింగ, హ రున్ భాష, బికే పంపాపతి , జగన్నాథ ఆచారి, గాది లింగ, తాయప్పతదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌పై హర్షం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నందికొట్కూరు : రాష్ట్రంలో ఉన్నటువంటి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి తోడ్పడేలా ఉందని నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు. ఆదివారం అల్లూరు గ్రామంలో మాంద్ర స్వగృహం నందు విలేకరులతో మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం సమానంగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ను రాష్ట్రంలోని ఓటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టడం సంతోష దాకా విషయం అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్‌కి, రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

రమజాన్ కిట్లు పంపిణీ

- పేదవారి ఆకలి, సహనం రమజాన్ పరమార్థం
- జమాఅతె ఇస్లామీ నంద్యాల అధ్యక్షులు సమద్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో 300 రమజాన్ కిట్లు పంపిణి చేసామని, పేద వారి ఆకలి, సహనం రమజాన్ పరమార్థమని జమాఅతె ఇస్లామీ నంద్యాల అధ్యక్షులు సమద్ తెలిపారు. ప్రతి సంవత్సరం లాగే ఈ రమజాన్ వసంతంలో గుర్తించిన పేద వారికి దాతల సహకారంతో రమజాన్ కిట్లు పంపిణి చేస్తున్నట్లు జమాఅతె ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ అధ్యక్షులు అబ్దుల్ సమద్ తెలిపారు. రూ.1000/- విలువ గల మొత్తం 300 కిట్లను జిల్లా బాధ్యులు సీఎం జిక్రియాతో కలిసి సమద్ పంపిణి చేసి మాట్లాడారు. ఒక కిట్టులో మంచి బియ్యం, మంచినూనే, చక్కెర, కందిపప్పు, గోధుమ పిండి, సేమియాలు, కారం, జీడిపప్పు తదితర పదమూడు వంట సరుకులు ఉంటాయని, పదమూడు వందల విలువైన దినుసులు వెయ్యి రూపాయలకే గోల్డెన్ బేకరి అఫ్రోజ్ ఇచ్చినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్ జీలాని, పివి ముస్తఫా, ఫయాజ్, అబ్దుల్ అలీం, అఫ్రోజ్, దాదాపీర్, ఎస్ఐఓ ముస్తాఖ్, అబ్దుల్లా , ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో సజీవ దహనమైన పశువుల యజమానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర -నంద్యాల : శిరివెళ్ల మండల పరిధి లోని, మహదేవపురం గ్రామంలో శనివారం తెల్లవారుజామున సంభవించిన భారీ అగ్ని

ప్రమాదంలో 12 మూగజీవాలు పాడిగేదలతో సహా సజీవ దహనం కాగా మిగిలిన గేదెలు సైతం తీవ్ర గాయాలతో కంటిచూపు కనిపించక జీవన్మరణ సమస్యగా పోరాడుతున్న విషాదకర సంఘటన చూసిన వారి హృదయం కలచి వేసేలా చేసింది. మహదేవపురం గ్రామానికి చెందిన కంపరాజు రాజేష్ గౌడ్ మానవతా హృదయంతో బాధిత పాడి పరిశ్రమ రైతు షేక్ మహబూబ్ బాషా కు ఆదివారం 20వేల రూపాయల నగదు ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. పాడి పరిశ్రమను నమ్ముకొని పాడి గేదెలను పెంచి పోషిస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబం ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆ కుటుంబ పడ్డ కష్టాలు కలలు అగ్నికి ఆహుతి అయ్యాయి. కష్టాల్లో ఉన్న సాటి మనిషికి చేతనైనంత సహాయం అందించాలన్న సదుద్దేశంతో ఈ చిన్న సహాయం అందించినట్లు కంపరాజు రాజేష్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ,రెవెన్యూ శాఖలు స్పందించి అగ్ని ప్రమాదంలో సజీవ దహనం అయి మూగజీవాలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన బాధిత యజమానిని ఆదుకోవాలని రాజేష్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.